క్లుప్తంగా

'వయ్యారిభామ'తో పంటకు నష్టం



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తిరుపతి రూరల్ : వయ్యారిభామ కలుపుమొక్కతో పంటకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని పెరుమాళ్లపల్లె వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్వీ సరళ తెలిపారు. బుధవారం ఈ మేరకు పరిశోధన స్థానంలో పార్థీనియం కలుపు మొక్కల నివారణ వారోత్సవాలు నిర్వహించారు. ఈ మొక్కల వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఠాగూర్, వసంత, రాధ, వినయపతి, మునిశేఖర్ నాయుడు, మోహన్ రెడ్డి, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

అత్యున్నతం.. అన్నదానం



జ్యోతి ప్రజ్వలనలో శివస్వామి తదితరులు

తిరుపతి కల్చరల్ : ప్రపంచంలో అత్యున్నతమైంది అన్నదానమని తాళ్లాయపాళెం శ్రీశైవ క్షేత్రం కోటిలింగ మహాక్షేత్రం పీఠాధీశ్వరుడు శివస్వామి తెలిపారు. బుధవారం కరకంబాడి రోడ్డులోని రాజారెడ్డి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వాసవి గ్రాండ్ నిత్య అన్నప్రసాద ట్రస్ట్ నూతన భవన సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. శివస్వామి భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. ప్రతి ఒక్కరు ధర్మాన్ని ఆచరించాలని, దైవం పట్ల భక్తి శ్రద్ధలతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు విట్టా సత్యనారాయణ, కోటి లింగ క్షేత్రం అన్నప్రసాద కమిటీ ప్రధాన కార్యదర్శి ఇరుకుళ్ల చెన్నకేశవరావు, శ్రీశైలం వాసవి సత్ర సముదాయం అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సుభాషిణి

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లె పంచాయతీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి బుధవారం శ్రీకారం చుట్టారు. సుమారు రూ.60 లక్షల వ్యయంతో చేపట్టిన పనులకు సర్పంచ్ బొల్లినేని సుభాషిణి, కాంట్రాక్టర్ శుభగిరి నాయుడు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఇప్పటికే దాదాపు రూ.కోటి వెచ్చించి యుడీఎస్ పనులను పూర్తి చేశామన్నా రు. తాజాగా రూ.60 లక్షలతో కొత్త చెర్లోపల్లెలో ని అన్ని వీధులకు యుడీఎస్ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. అలాగే వకులామాత ఆలయం వరకు నిర్మిస్తున్న నూతన రహదారి సైతం త్వరలోనే పూర్తి చేయనున్నట్లు వివరించారు.

ప్రజారోగ్య రక్షణకు పెద్దపీట వేస్తాం.. పంచాయతీలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతాం.. పారిశుద్ధ్య నిర్వహణను పకడ్బందీగా అమలు చేస్తాం.. కాలనీలను దోమల రహితంగా మారుస్తాం.. వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపడతాం.. స్టాప్ డయేరియా.. ఫ్రైడే డ్రైడే అంటూ మంగళం పంచాయతీలో అధికారులు.. ప్రజాప్రతినిధులు ఊదరగొట్టారు. పేరుకుపోయిన చెత్త దిబ్బలను తొలగిస్తున్నట్టు ఫొటోలకు ఫోజులు ఇచ్చారు. ఇంకేముంది కలెక్టర్.. ఎమ్మెల్యే రంగంలోకి దిగేశారు మన పంచాయతీ అద్దంలా మెరిసిపోతుందని స్థానికులు సంతోషపడ్డారు. రోగాల నుంచి తమకు విముక్తి లభించిందని ఆనందించారు. తీరా తత్వం బోధపడగానే అవాక్కయ్యారు. మళ్లీ పరిసరాలు అధ్వానంగా తయారయ్యేసరికి దిక్కుతోచకస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆదర్శ పంచాయతీగా అభివృద్ధి చేస్తాం అంటే ఇలాగేనా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజారోగ్యానికి మంగళం



ఆర్టీసీ ఆఫీస్ సమీపంలో పేరుకుపోయిన చెత్త

- మంగళంలో పడకేసిన పారిశుద్ధ్యం
- చెత్తచెదారాలతో దుర్వాసన వెదజల్లుతున్న వీధులు
- తూతూమంత్రంగా పరిసరాల పరిశుభ్రత
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

తిరుపతి మంగళం : తిరుపతి రూరల్ మండలంలోని మంగళం పంచాయతీలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. పట్టించుకునే వారు లేక వీధులు చెత్తమయంగా మారిపోయాయి. ఇటీవల స్టాప్ డయేరియా, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాల పేరిట కలెక్టర్, ఎమ్మెల్యే పులివర్తి నాని హడావుడి చేశారు. పంచాయతీలో చెత్తకుప్పలను తొలగిస్తున్నట్లు కాసేపు ఫోజులిచ్చారు. ఇదే విధంగా పారిశుద్ధ్య నిర్వహణ ఉండాలని అధికారులను ఆదేశించి చేతులు దులిపేసుకున్నారు. ఇలా రావడం.. మాటలు చెప్పడం.. ఆదేశాలు జారీ చేయడం.. తర్వాత ఆ ఊసే ఎత్తకపోవడం.. వాటిని వినీవిన్నట్టు ఉండడం.. మాకు అలవాటే అన్నట్టుగా పంచాయతీ అధికారులు భావించినట్టు ఉంది. పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేశారు.



చెత్త తొలగిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే పులివర్తి నాని (ఫైల్)

గుట్టలు గుట్టలుగా..

అలాగే సప్తగిరినగర్, రణధీర్‌పురం, మంగళం, తిరుమలనగర్ పంచాయతీల్లోని రోడ్లపై చెత్త గుట్టలు గుట్టలుగా కనిపిస్తోంది. రోజుల కొద్దీ చెత్త నిల్వ చేరడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నారు. చెత్త కుప్పలను దోమలు ఆవాసాలుగా చేసుకుని రాత్రి, పగలు అన్న తేడా లేకుండా విజృంభిస్తున్నాయని మంగళంవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై చెత్తను తొలగించాలని పంచాయతీల కార్యదర్శులకు అనేకమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారని, క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.



వెంకటేశ్వకాలనీలో..

పట్టించుకునే వారే లేరు

పంచాయతీల్లో చెత్త తొలగించకుండా రోడ్లపై వదిలేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఎమ్మెల్యే నాని ఒక్క రోజు వచ్చి చెత్తను తొలగించి వెళ్లిపోయారు. పంచాయతీ అధికారులు సైతం ప్రజల ఆరోగ్యం పట్ల ఎలాంటి శ్రద్ధ చూపడం లేదు. చెత్తకుప్పలను తొలగించాలని పదే పదే చెబుతున్నా పట్టించుకునే వారే లేరు. ఇలా రోడ్లపై చెత్తకుప్పలు ఉంటే రోగాలు రావా?. పరిశుభ్రతపై మాటలే తప్ప ఆచరణ కనిపించడంలేదు. చెత్త తొలగించరు.. మురుగుకాలువలు శుభ్రం చేయరు, ఇలా ఉంటే ఎలా ఉండగలుగుతాం.

\- సరస్వతమ్మ, బీటీఆర్‌కాలనీ

దుర్వాసన భరించలేకున్నాం

మంగళం పంచాయతీలోని రోడ్లపై పేరుకపోయిన చెత్తకుప్పల నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నాం. రాత్రి, పగలు తేడా లేకుండా దోమలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే అనేక మంది విషజ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలయ్యారు. చెత్త కుప్పలు తొలగించడం లేదు. దోమల నివారణకు ఫాగింగ్ చేయడంలేదు. కనీసం బ్లీచింగ్ కూడా చల్లడం లేదు. ఇలా అయితే డయేరియా, మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలు రాక మరేమొస్తాయి. అటు పాలకులు, ఇటు పంచాయతీ అధికారులు మాటలు చెప్పడం కాదు చేతల్లో చేసి చూపితే బాగుంటుంది.

\- రమణయ్య, మంగళం

ఒంటిమిట్టలో 'బాలాలయం'

తిరుపతి (అలిపిరి) : ఒంటిమిట్ట శ్రీకోదండరామ స్వామివారి ఆలయంలో సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు బాలాలయం పనులు చేపట్టనున్నారు. గర్భాలయ జీర్ణోద్ధరణలో భాగంగా మండపంలో నమూనా ఆలయం ఏర్పాటుచేసి మూలవర్ల చిత్ర పటాలను ఏర్పాటు చేయనున్నారు. 8వ తేదీ ఉదయం 9.30 నుంచి 10.30 గంటల మధ్య బాలాలయ సంప్రోక్షణ పూర్తి చేయనున్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

తిరుపతి రూరల్ : సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఎంపీడీవో రమేష్ బాబు మాట్లాడుతూ అభివృద్ధి ప్రణాళిక తయారీ, పారిశుద్ధ్య నిర్వహణ తదితర కార్యక్రమాల్లో సర్పంచులు, కార్యదర్శులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పంచాయతీ పరిధిలోని ప్రతి అంశంపై అవగాహన పెంపొందించుకునేందుకు పుస్తకాలను సైతం అందిస్తున్నట్లు చెప్పారు. నేర్చుకున్న అంశాలను పక్కాగా అమలు చేసి గ్రామీణాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈఓపీఆర్‌డీ గిరిధర్ రెడ్డి, మాలతి పాల్గొన్నారు.

30న లక్ష కుంకుమార్చన

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయంలో ఈనెల 30వ తేదీన కామాక్షి అమ్మవారికి శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గణపతి పూజ, తిరువీధి ఉత్సవం జరిపించనున్నారు.

పంచాయతీ ఈఓపై ఫిర్యాదు

తిరుపతి టాస్క్‌ఫోర్స్ : పాకాల మండలం దామలచెరువు పంచాయతీ ఇన్‌చార్జి ఈఓగా గతంలో పనిచేసిన మోతీ అక్రమాలకు పాల్పడినట్లు చంద్రశేఖర్ అనే వ్యక్తి ఆరోపించారు. బుధవారం ఈ మేరకు ఎంపీడీఓ ప్రభాకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎంపీడీఓ దీనిపై సమగ్ర విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు.

సీమ అభివృద్ధి విస్మరణ

తిరుపతి కల్చరల్: సీఎం చంద్రబాబు రాయలసీమ అభివృద్ధిని విస్మరిస్తున్నారని కాంగ్రెస్ మీడియా సెల్ చైర్మన్ తులసిరెడ్డి విమర్శించారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. రాయలసీమ అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జీవో 22ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అట్లాస్‌ల పంపిణీ



విద్యార్థులు, ఉపాధ్యాయులతో దాత తులసీరామ్

పాకాల : మండలంలోని దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు బుధవారం స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కేఎస్ తులసీరామ్ రూ.6వేల విలువైన అట్లాస్‌లను వితరణగా అందించారు. ఈ క్రమంలోనే దామలచెరువులో ఆరుగురు చిరువ్యాపారులకు మ్యాంగోనగర్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పి.నాగూర్‌బాషా ఆధ్వర్యంలో గొడుగులు పంపిణీ చేశారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్

భాకరాపేట : ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు బయోస్టాట్ సంస్థ ప్రతినిధి నాగరాజా తెలిపారు. బుధవారం చిన్నగొట్టిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10 మంది విద్యార్థులకు రూ.2,500 చొప్పున పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకే స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని మృదులాదేవి పాల్గొన్నారు.



విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

బీసీ బాలికల హాస్టల్ తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు



పాకాల : సూచనలిస్తున్న తహసీల్దార్ నిత్యానందబాబు

చంద్రగిరి : స్థానిక ప్రభుత్వ బాలికల బీసీ హాస్టల్‌ను ఎంఈఓ–2 భాస్కర్ బాబు, తహసీల్దార్ శివరామ సుబ్బయ్య, ఎంపీడీఓ బాలాజీ నాయక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వార్డెన్ మాట్లాడుతూ 120 విద్యార్థినులు హాస్టల్ ఉన్నారని, సరిపడా మరుగుదొడ్లు లేవన్నారు. అలాగే పడుకునేందుకు సరైన గదులు లేవని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. హాస్టల్‌లో కల్పించాల్సిన వసతులపై నివేదిక ఇవ్వాలని వారు సూచించారు. అనంతరం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆహార నాణ్యతపై విద్యార్థినులను ఆరా తీశారు.

పాకాలలో..

పాకాల : స్థానిక బీసీ హాస్టల్‌ను తహసీల్దార్ నిత్యానందబాబు బుధవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో విద్యార్థులు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డీటీ పరదేశి పాల్గొన్నారు.

అలిపిరి సీఐగా రామకిషోర్



తిరుపతి క్రైమ్ : అలిపిరి సీఐగా రామ కిషోర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతిలో ఈస్ట్ స్టేషన్‌లో పనిచేసిన అనుభవం ఉందని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. శ్రీవారి భక్తులకు మెరుగైన సేవలందిస్తానని వెల్లడించారు.

సీఐ తమీమ్ అహ్మద్‌కు ఘనంగా వీడ్కోలు



సీఐ తమీమ్ అహ్మద్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

తిరుపతి రూరల్ : బదిలీపై వెళుతున్న తిరుపతి రూరల్ సీఐ తమీమ్ అహ్మద్‌కు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ క్రమంలోనే నూతన సీఐగా సాధిక్ అలీ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎస్‌ఐలు నాగేంద్రబాబు, షేక్ షా వలీ, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు.

వర్గీకరణపై నిరసన వెల్లువ



చంద్రగిరి టవర్‌క్లాక్ సెంటర్‌లో నినాదాలు చేస్తున్న దళిత నాయకులు



తిరుపతిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాలు

చంద్రగిరి : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతమాకుల పుణ్యమూర్తి మాట్లాడుతూ అన్నదమ్ములుగా మనుగడ సాగిస్తున్న దళిత, గిరిజనవర్గాలను విడగొట్టే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. అభివృద్ధి పేరుతో దళితులను విభజించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాను యూనిట్‌గా తీసుకుని వర్గీకరిస్తామని సీఎం చంద్రబాబు చెప్పడం సరికాదని స్పష్టం చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ఆశయ సాధన పోరాట సమితి అధ్యక్షుడు బాదూరు ఎల్లయ్య, యానాదుల సంక్షేమ సంఘం నాయకుడు పరమాల గోపి పాల్గొన్నారు.

ప్రశాంతంగా బంద్

తిరుపతి కల్చరల్ : ఎస్సీ వర్గీకరణకు నిరసనగా దళిత సంఘాలు చేపట్టిన భారత్ బంద్ బుధవారం తిరుపతిలో ప్రశాంతంగా సాగింది. ఈ సందర్భంగా పలు సంఘాల నేతలు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బైఠాయించారు. అనంతరం గాంధీ విగ్రహం, రైల్వేస్టేషన్ మీదుగా కర్నాల వీధి, ఎన్టీఆర్ సర్కిల్, జ్యోతిరావు పూలే సర్కిల్, ఆర్ట్స్ కళాశాల, ఎస్వీయూనివర్సిటీ, పద్మావతి కళాశాల, మహిళా వర్సిటీ మీదుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ భవన్ చైర్మన్ పరమశివన్, కార్యదర్శి నాగేశ్వరరావు, కోశాధికారి కె.మురళి, టీటీడీ ఎస్సీ ఉద్యోగుల సంఘం నేత ప్రసాద్‌రావు, అంబేడ్కర్ యువజన సంఘనేతలు చెన్నకేశవులు, మునిబాబు, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు పున్నాక సురేష్, కుసుమకుమారి, సమతా సైనిక్ దళ్ నేత రాధాకృష్ణ, రాజేస్‌కుమార్, సురేష్ కుమార్, రెడ్డెప్ప, బహుజన సమాజ్ పార్టీ నేత జయబాల, ధనశేఖర్, వివిధ దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల ఆందోళన



మాట్లాడుతున్న కందారపు మురళి

తిరుపతి(అలిపిరి): శ్రీవారి మెట్టు నడక మార్గంలో చిరు వ్యాపారులు బుధవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ చిరువ్యాపారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. హఠాత్తుగా ఖాళీ చేయమని చెప్పడం దారుణమని మండిపడ్డారు. గతంలో టీడీపీ నేతలు కూడా చిరువ్యాపారులకు మద్దతు పలికారని, ఇప్పుడు ముఖం చాటేయడం సరికాదన్నారు. టీటీడీ అధికారులు సాంకేతిక కారణాలు చూపి వ్యాపారులను అడ్డుకోవడం సమజసం కాదని స్పష్టం చేశారు. పేదలకు రాజకీయాలు అంటగట్టి ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. టీటీడీ ఈఓ శ్యామలరావు సమస్యను గుర్తించి వారి కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జయచంద్ర, లక్ష్మి, వేణుగోపాల్, బుజ్జి, సాయి లక్ష్మి, చిట్టిబాబు, కార్యదర్శి లోకనాథం పాల్గొన్నారు.

అద్వితీయ నృత్యం



మహతి కళాక్షేత్రంలో కొరముట్ల తేజస్విని బుధవారం అద్వితీయంగా కూచిపూడి నృత్య అరంగేట్రం చేసింది. తన గురువు దీప దివ్యమోహన్ నేతృత్వంలో చేసిన నృత్యాభినయం ప్రేక్షకులను ఆకట్టుకుంది. జిల్లాకు చెందిన ఉదయ్ శంకర్ వృత్తిరీత్యా యూనైటెడ్ కింగ్‌డమ్‌లో నివసిస్తున్నా తన కుమార్తెకు నృత్యంలో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. తిరుమల శ్రీవారి పాదాల చెంత తొలి ప్రదర్శన ఇప్పించారు. ఈ క్రమంలోనే తేజస్విని అభినయించిన నృత్యం.. హావభావాలకు సభికులు హర్షధ్వానాలు చేశారు.

\- తిరుపతి కల్చరల్

అనితర 'వైద్యం'





ఆందోళన సమయంలోనూ..విధి నిర్వహణను విస్మరించలేదు. మనసులో ఆవేదన పెల్లుబుతున్నా.. సేవాభావం విడనాడలేదు. కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనకు నిరసన తెలియజేస్తూనే.. రోగులకు చికిత్సలందించారు. బుధవారం తిరుపతి స్విమ్స్ ఆస్పత్రి ఎదుట దీక్ష చేపట్టిన డాక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ చెట్టు కింద కూర్చుని ఓపీ వైద్యసేవలందించారు. ఈ క్రమంలోనే తోటి వైద్యురాలిపై జరిగిన అకృత్యాన్ని ఖండిస్తూ తెల్లటి వస్త్రంపై చేతిముద్రలను వేసి బాధిత కుటుంబానికి సంఘీభావం తెలిపారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి